## క్లుప్తంగా

### తొలగనున్న తాగునీటి కష్టాలు


కాలనీలో పైప్‌లైన్ నిర్మాణ పనులు జరుగుతున్న దృశ్యం

కోవెలకుంట్ల: మండలంలోని చిన్నకొప్పెర్ల గ్రామంలోని ఎస్సీ కాలనీవాసుల తాగునీటి కష్టాలు తొలగనున్నాయి. కాలనీలో కుళాయిల సౌకర్యం లేకపోవడంతో గ్రామంలోకి వచ్చి మంచి నీటిని తీసుకెళ్లాల్సి వచ్చేది. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రత్యేక చొరవతో మండల పరిషత్ నుంచి రూ. 1.20 లక్షలు కేటాయించారు. ఈ మేరకు ఓవర్‌హెడ్ ట్యాంకు నుంచి కాలనీలో పైప్‌లైన్, కుళాయి ఏర్పాటు పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. తాగునీటి సమస్య తీరుతుండడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### రోడ్డు నిబంధనలు పాటించాలి


సమావేశంలో మాట్లాడుతున్న క్రాంతి కుమార్

బేతంచెర్ల: ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలని, ప్రమాదాలను నిర్మూలించాలని డోన్ మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ క్రాంతి కుమార్, సీఐ ప్రీతం రెడ్డి, ఎస్ఐ శివ శంకర్ నాయక్ సూచించారు. శనివారం పట్టణంలోని పాణ్యం సిమెంట్ జూనియర్ కళాశాలలో రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు రహదారులపై భద్రతపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ హెల్మెట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బాల కృష్ణ పాల్గొన్నారు.

### నివాళి

కొలిమిగుండ్ల: మండల కేంద్రం కొలిమిగుండ్ల కొండపై శ్రీకృష్ణదేవరాయల కాలంలో నిర్మించిన లక్ష్మీనరసింహస్వామి ఆలయ పూజారి, రిటైర్డ్ పీఈటీ బూడిదపాటి రాఘవయ్య అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందిన విషయం తెలిసిందే. ఆయన మృతి పట్ల మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఎర్రబోతుల ఉదయ్‌భాస్కర్‌రెడ్డి, అవుకు మండల ఎంపీపీ చల్లా రాజశేఖరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు చల్లా భాస్కర్‌రెడ్డి, చల్లా ప్రభాకర రెడ్డి, పేరం బయ్యపురెడ్డి, సూర్యనారాయణరెడ్డి, రామ్‌కో సిమెంట్ జనరల్ మేనేజర్ రవికుమార్, మేనేజర్ శోభన్‌బాబు తదితరులు సంతాపం తెలిపారు. ఆయన మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.

### బస్సు ఢీకొని వాగులో పడిన ట్రాక్టర్

కోవెలకుంట్ల: మండలంలోని భీమునిపాడు సమీపంలోని కుందరవాగు వద్ద శనివారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు.. దొర్నిపాడు వైపు నుంచి వరిగడ్డి ట్రాక్టర్ కోవెలకుంట్ల వస్తూ కుందరవాగు వంతెన సమీపానికి చేరుకుంది. ఇదే వైపు నుంచి ఆర్టీసీ బస్సు వస్తుండగా డ్రైవర్ హారన్ కొట్టాడు. ట్రాక్టర్ డ్రైవర్ బస్సుకు సైడ్‌ఇచ్చే క్రమంలో తిరిగి రోడ్డుపైకి రావడంతో వెనుకవైపు నుంచి బస్సు ఢీకొట్టింది. వరిగడ్డి ట్రాక్టర్ వాగులో పడిపోయింది. ప్రమాదంలో ఎవరికి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఎస్ఐ వెంకటరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు.

### వైఎస్సార్ బీమా సాయం అందజేత


బాధితురాలికి నగదు అందజేస్తున్న దృశ్యం

సంజామల: మండల పరిధిలోని ఆకుమల్ల గ్రామానికి చెందిన మాలె ఏసయ్య గుండెపోటుతో మృతి చెందాడు. ఈ మేరకు శనివారం మృతిని భార్య మాలె రాజమ్మకు వైఎస్సార్ బీమా తక్షణ సాయం రూ.10 వేలను సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ ధరణి, సర్పంచ్ నూలి చిన్న వెంకటయ్య, ఆకుమల్ల సొసైటీ బ్యాంక్ చైర్మన్ గౌరిగారి నాగేశ్వర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు గౌరిగారి వేంకటేశ్వర్ రెడ్డి అందజేశారు.


### పాఠశాలల తనిఖీ


అవుకు కేజీబీవీలో విద్యార్థిని నోట్‌బుక్‌ను పరిశీలిస్తున్న ఎంఈఓ రాజయ్య

అవుకు: మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కొలిమిగుండ్ల ఎంఈఓలు రాజయ్య, అబ్దుల్ కలాంలు శనివారం తనిఖీ చేశారు. ఉప్పలపాడు, కునుకుంట్ల, అవుకులోని కస్తూర్బా, చెర్లోపల్లె, రామాపురం పాఠశాలలను పరిశీలించారు. సిలబస్ ఎంతవరకు పూర్తయ్యిందనే వివరాలపై ఆరా తీశారు. అలాగే విద్యార్థుల వర్క్‌బుక్, నోట్‌బుక్స్‌లను ఆయా ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు పరిశీలించి సంతకాలు చేశారా లేదా అని పరిశీలించారు. అలాగే ట్యాబ్‌లను వినియోగంపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

# ఇంటింటికీ తాగునీరు

- నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం
- డిసెంబర్ నాటికి పనులు పూర్తి చేయాలి
- నీటిశుద్ధి ప్లాంట్ నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రి బుగ్గన


ప్లాంట్ నిర్మాణ పనుల పురోగతిపై ఇంజినీర్లతో చర్చిస్తున్న మంత్రి బుగ్గన

బేతంచెర్ల: ఇంటింటికీ తాగునీరు సరఫరా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఆర్థిక శాఖమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గ కేంద్రం డోన్‌తోపాటు బేతంచెర్ల, ప్యాపిలి మండలాల్లో శాశ్వతంగా తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని, రూ. 330 కోట్లతో గోరుకల్లు రిజర్వాయర్ నుంచి పైపులైన్ ఏర్పాటు చేస్తున్నామని గుర్తు చేశారు. మండల పరిధిలోని బుగ్గానిపల్లె తండా గ్రామ సమీపాన ఎనిమిది ఎకరాల్లో నిర్మిస్తున్న నీటి శుద్ధి కేంద్రం పనులను శనివారం సాయంత్రం మంత్రి బుగ్గన పరిశీలించారు. పనుల పురోగతిపై ఇంజినీర్లతో చర్చించారు. పనులు సాగుతున్న తీరు, నాణ్యత ప్రమాణాలపై మంత్రి ఆరా తీశారు. పనుల వేగం పెంచాలని, అలసత్వం తగదన్నారు. డిసెంబర్ నాటికి పనులు పూర్తి చేయాలని మెగా సంస్థ ఇంజినీర్లను మంత్రి బుగ్గన ఆదేశించారు. ఈ పనులు పూర్తయితే డోన్ నియోజకర్గంలో నీటి సమస్యే తలెత్తదన్నారు. అధికారులు అప్రమత్తంగా వ్యవహరించి త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అదేవిధంగా సోమవారం గోరుకల్లు రిజర్వాయర్ నుంచి చేపట్టిన పైపులైన్ నిర్మాణ పనులను మెగా సంస్థ నిర్వాహకులతో కలిసి మంత్రి బుగ్గన పరిశీలించనున్నట్లు సమాచారం. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, మంత్రి ఓఎస్డీ ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు.

**మంత్రులను కలిసిన జెడ్పీ చైర్మన్**


మంత్రులు బుగ్గన, పెద్దిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, నంద్యాల జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్

మండల కేంద్రం బేతంచెర్లలోని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి నివాసంలో శనివారం గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి భేటీ అయ్యారు. బనగానపల్లెలో జరిగే నాపరాయి మైనింగ్ పరిశ్రమలకు సంబంధించిన సమావేశం నేపథ్యంలో ఇరువురు మంత్రులు కలిశారు. మంత్రులు బుగ్గన, పెద్దిరెడ్డిని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, నంద్యాల జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్, ఉమ్మడి జిల్లా ఎస్ఈ ఉమా పతి మర్యాదపూర్వకంగా కలిశారు.

## అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకటరెడ్డి

డోన్ టౌన్ : అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని, బూత్ లెవల్ అధికారులు, సూపర్ వైజర్లు, వీఆర్వోలు నిర్దేశించిన లక్ష్యాలను నిర్జీత సమయంలో పూర్తి చేయాలని ఆర్డీఓ వెంకటరెడ్డి ఆదేశించారు. స్థానిక రోడ్లు భవనాల శాఖ నూతన అతిథి గృహంలో శనివారం ఓటర్ల జాబితాపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితా తయారీపై ఇంటింటి సర్వే గురించి బూత్‌ల వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ మాట్లాడుతూ ఇంటింటి సర్వే చేసే సమయంలో పకడ్బందీగా వివరాలు సేకరించాలని, ఇతరుల ఆక్షేపణలకు తావులేకుండ సర్వే నిర్వహించాలన్నారు. ఓటు హక్కు కోసం 18 ఏళ్లు నిండిన వారికి ఫారం6, ఓటర్ల మార్పు, చేర్పు, తొలగింపుల కోసం ఫారం 7,8లను ఉపయోగించాలని ఆదేశించారు. ఓటర్ల జాబితా, సర్వేపై త్వరలో జిల్లా కలెక్టర్ డోన్‌కు పర్యటించే అవకాశాలు ఉన్నాయని, అన్నివివరాలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. సమాచారం సక్రమంగా లేకున్నా, విధుల పట్ల నిర్లక్ష్యం వహించినా చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఆర్డీఓ హెచ్చరించారు. సమావేశంలో తహసీల్దార్ విద్యా సాగర్, డిప్యూటీ తహసీల్దార్ మధు తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న పాలనలోనే పేదలకు మేలు


మాట్లాడుతున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి

బేతంచెర్ల: సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనలో పేదలకు ఎంతో మేలు జరిగిందని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, ఉర్దూ అకాడమీ కమిటీ సభ్యులు ముర్తుజావలి తెలిపారు. శనివారం పట్టణంలోని సంజీవనగర్, హనుమాన్ నగర్ కాలనీల్లో కౌన్సిలర్లు నాగజ్యోతి, మహేశ్వరీ ఆధ్వర్యంలో ఏపీకి సీఎం జగన్ ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వైఎస్సార్‌సీపీ జెండా ను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ మహానేత వైఎస్సార్ లాగే సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పేదల కష్టాలు తెలిసిన నాయకుడన్నారు. వైఎస్సార్ ప్రభుత్వంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నిరంజన్, కృష్ణమూర్తి, మనోహర్, కిరణ్, వలిబాషా, గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### రాతితో రామాలయ నిర్మాణం


గ్రామంలో నిర్మిస్తున్న సీతారాముల ఆలయం

బేతంచెర్ల: మండల పరిధిలోని శంకరాపురంలో నూతనంగా సీతారాముల ఆలయం నిర్మిస్తున్నారు. మండలంలో ఎక్కడా లేనివిధంగా అంతారాతి నిర్మాణంతో ఆలయాన్ని ఆళ్లగడ్డకు చెందిన శిల్పులు నిర్మిస్తున్నారు. గ్రామస్తులు, దాతలు, భక్తుల సహకారంతో సుమారు రూ.70 లక్షలతో ఆలయాన్ని నిర్మిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

## మద్దిలేటయ్య ఆలయాభివృద్ధికి రూ.3.70 లక్షల విరాళం


ఆలయ అభివృద్ధికి నగదు అందజేస్తున్న దాతలు

బేతంచెర్ల: మండల పరిధిలో వెలసిన శ్రీలక్ష్మీ గణమద్దిలేటి నరసింహస్వామి ఆలయాభివృద్ధికి విరాళాలు వెల్లువెత్తాయి. శనివారం కర్నూలు పట్టణానికి చెందిన గుర్రం చిన్న మద్దిలేటి భార్య లక్ష్మీదేవమ్మ జ్ఞాపకార్థం ఆలయానికి వచ్చే భక్తుల తాగునీటి సౌకర్యార్థం రూ.2,70 లక్షలు విరాళంగా అందజేశారు. అదేవిధంగా డోన్ మండలం కన్నప్పకుంట గ్రామానికి చెందిన కాళ్ల జైపాల్ రెడ్డి, లక్ష్మీదేవి దంపతులు దేవస్థానం అభివృద్ధికి తమవంతుగా రూ.1,00,116 ఈఓ పాండు రంగారెడ్డి, చైర్మన్ రామచంద్రుడికి అందజేశారు.

**మద్దిలేటయ్య ఒక్క రోజు ఆదాయం రూ.10,09,527**

మద్దిలేటి స్వామివారిని కార్తీక మాసం శనివారం భక్తులు పెద్దఎత్తున దర్శించుకున్నారు. స్వామి, అమ్మ వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనార్థం తరలివచ్చిన భక్తుల వివిధ సేవల ద్వారా రూ.10,09,527 ఆదాయం వచ్చినట్లు ఈఓ పాండు రంగారెడ్డి, చైర్మన్ రామచంద్రుడు తెలిపారు.

### కర్ణాటక మద్యం స్వాధీనం


మద్యం, ముద్దాయి అరెస్టు చూపిస్తున్న సెబ్ సీఐ భీమలింగడు

డోన్ రూరల్ : ప్యాపిలి మండలంలోని జలదుర్గం గ్రామం వద్ద కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నామని సెబ్ సీఐ భీమలింగడు తెలిపారు. డోన్ పట్టణంలోని సెబ్ కార్యాలంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను సీఐ తెలిపారు. జలదుర్గం గ్రామానికి చెందిన బంగిరామాంజినేయులు బొలెరో వాహనంలో కర్ణాటక మద్యం తరలిస్తుండగా దాడులు చేశామన్నారు. 21 బాక్స్‌లు, బొలెరో వాహనం స్వాధీనం చేసుకుని, నిందుతుడిని అదుపులోకి తీసుకున్నామన్నారు. మొత్తం 2,016 టెట్రా ప్యాకెట్లు( 90ఎంఎల్ ) ఉన్నాయన్నారు. పట్టుబడిన వ్యక్తిని విచారించగా కర్నూలు పట్టణంకు చెందిన ఈడిగ గిరిబాబు కరాణటక మద్యం సరఫరా చేస్తున్నట్లు తెలిసిందన్నారు. అనంతరం పట్టుబడిన ముద్దాయిని మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరుచగా రిమాండ్‌కు ఆదేశించినట్లు సీఐ వివరించారు.

**10 లీటర్ల సారా స్వాధీనం**

అవుకు:మండల పరిధిలోని మంగంపేట గ్రామ సమీపంలో శనివారం 10 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. గ్రామానికి చెందిన కాట్రావత్ కళావతి గ్రామం వెలుపల నాటుసారా అమ్ముతూ పోలీసులను చూసి పరారయ్యిందన్నారు. నాటుసారాను స్వాధీనం చేసుకొని నిందితురాలిపై కేసు నమోదు చేశామని ఏఎస్ఐ తెలిపారు.

### ఉచితంగా కంటి అద్దాలు


కంటి అద్దాలు చూపుతున్న విద్యార్థినులు

డోన్ టౌన్ : వైఎస్సార్ కంటి వెలుగు పథకం కింద పేదలకు ఉచితంగా కంటి అద్దాలు అందిస్తున్నట్లు జలదుర్గం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆప్తాల్మిక్ అధికారి వైవీ రమణమూర్తి తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో భాగంగా శనివారం పట్టణ సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థినులకు కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలు అందజేశారు. విద్యార్థులకు కంటి జబ్బులపై అవగాహనకల్పించారు. దృష్టి లోపం ఏర్పడకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రిన్స్‌పాల్ గీతా, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్ : వెంకటాపురం రోడ్డులోని పేరంటాలమ్మ గుడి సబ్ స్టేషన్ పరిధిలోని హైవే ఫీడర్ కింద 11కేవీ షిఫ్టింగ్ పనుల నేపథ్యంలో ఆదివారం కరెంటు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కంభాలపాడు హైవే, తారక రామనగర్, శ్రీనివాసనగర్, టీచర్స్‌కాలనీ, వైఎస్సార్‌నగర్, శ్రీరామనగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

### ధూప దీప నైవేద్యానికి విరాళం

బనగానపల్లె రూరల్ : మండలంలోని పలుకూరులో వెలసిన శ్రీరామేశ్వర స్వామి ఆలయలో ధూప దీప, నైవేద్యం సమర్పించేందుకు అదే గ్రామానికి చెందిన భక్తుడు మధుమోహన్ రెడ్డి శనివారం విరాళం అందజేశారు. దాత రూ. 5 వేలు విరాళంగా ఇచ్చారని అర్చకుడు భాస్కరయ్య తెలిపారు.

### నేడు సాంబ శివాలయంలో ప్రత్యేక పూజలు

డోన్ టౌన్ : పట్టణ పోలీసు స్టేషన్ ప్రక్కన ఉన్న శ్రీసాంబ శివాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు కళ్లే శేషావలిశర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్తీక మాసంలో వచ్చే శ్రావణ నక్షత్రం కోటి సోమవారాలతో సమానమన్నారు. ఈ శ్రావణ నక్షత్రం ఈ సంవత్సరం కార్తీక మాసంలో ఆదివారం వచ్చిన సందర్భంగా ఈ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

### బీజేపీ మండల కమిటీ ఎంపిక

కొలిమిగుండ్ల: భారతీయ జనతా పార్టీ మండల నూతన కమిటీని శనివారం కొలిమిగుండ్లలో ఆ పార్టీ ఇన్‌చార్జ్‌లు అరవిందరెడ్డి, వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో ఎంపిక చేశారు. మండల అధ్యక్షుడిగా రామసుబ్బయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా రాముడు నాయక్, తల్లం శ్రీనివాసులు, పాపయ్య, శివ ప్రసాద్, అనిల్‌కుమార్, లక్ష్మీదేవి, జనరల్ సెక్రటరీలుగా నరేష్, మురళీ కృష్ణ, ట్రెజరర్‌గా పుల్లయ్య, కార్యదర్శులుగా రఘురాం, రామ్మోహన్, లోకేష్‌రెడ్డి, శ్రీరామచరణ్, సాయి, చౌడయ్యను ఎన్నుకున్నారు.

### ఇద్దరిపై కేసు నమోదు

డోన్ రూరల్ : మండల పరిధిలోని చిన్నమల్కాపురం గ్రామానికి చెందిన బద్దల వెంకటేశ్వర్లు, బద్దల లక్ష్మీదేవిపై శనివారం కేసు నమోదు చేసినట్లు రూరల్ పోలీస్‌లు తెలిపారు. తాను సాగు చేసిన జొన్న పంట పాడవడానికి బద్దల వెంకటేశ్వర్లు, బద్దల లక్ష్మీదేవి గడ్డి మందు కొట్టారని గ్రా మానికి చెందిన బద్దల భాస్కర్ పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### మోటార్ కాపర్ వైర్ చోరీ కేసు నిందితుల అరెస్టు

బేతంచెర్ల: మండల పరిధిలోని యంబాయి గ్రామానికి చెందిన మాదిగ నాగారాజు మోటార్ కాపర్ వైర్‌ను ఈనెల11వ తేదీన చోరీ చేశారు. బాధితుని ఫిర్యాదు మేరకు ఈ కేసులో నిందితులైన అదే గ్రామానికి చెందిన పసుపుల మద్దిలేటి, షేక్ ఫజల్‌ను అరెస్టు చేశామని ఏఎస్ఐ లింగమయ్య శనివారం తెలిపారు. నిందితుల నుంచి ఐదు కేజీల కాపర్ వైర్‌ను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

### ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

కొలిమిగుండ్ల: కార్తీక మాసం మొదటి శనివారం సందర్భంగా కోర్నపల్లె సమీపంలోని గుండం ఆంజనేయస్వామి ఆలయంలో ఉమ్మాయిపల్లె గ్రామస్తుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకం, ఆకు పూజ నిర్వ హించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. మైలవరం క్రిష్ణయ్య బృందం చెక్కభజన ప్రదర్శన ఆకట్టుకుంది.

## ఇష్టారాజ్యంగా చెట్లు నరికివేత


చెట్లను నరికివేయడంతో మొండిగా దర్శనమిస్తున్న దృశ్యం

డోన్ : కాలుష్య నివారణ, పచ్చదనం కోసం మున్సిపల్ అధికార యంత్రాంగం, స్వచ్ఛంద సంస్థలు నాటిన మొక్కలను కొందరు ఇష్టారాజ్యంగా నిరికేస్తున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యారు. ఎంతో వ్యయప్రయాసాలక ఓర్చి నాటిన మొక్కల సంరక్షణకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో పట్టణంలో చాలా ప్రాంతాల్లో చెట్లను కొట్టేస్తూనే ఉన్నారు. పట్టణంలోని విజయ థియేటర్, డాక్టర్ రామసుబ్బయ్య పార్కు, శ్రీనివాస థియేటర్ ప్రాంతాల్లో రోడ్లకు ఇరువైపులా నాటిన చెట్లను నరికివేసి కొందరు వంట చెరుకుకు వినియోగిస్తున్నారని ప్రకృతి ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చెట్ల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


వంటకు కట్టెలను ఎత్తుకెళ్తున్న మహిళలు


చెట్లను నరికివేసిన దృశ్యం

### విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు

బేతంచెర్ల: విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఏడీ మధ సూదన్ రెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని అయ్యాల చెర్వు నుంచి బుగ్గానిపల్లె వరకు నూతనంగా వేసిన రహదారిపై భారీ వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా గతంలో ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి, 33కేవీ విద్యుత్ లైన్‌కు 11 మీటర్ల విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశామని ఆయన చెప్పారు.

### కంటైనర్ ఢీకొని స్కూటరిస్టు మృతి

డోన్ టౌన్ : పట్టణ సమీపంలోని జాతీయ రహదారి సమీపాన కోట్ల సుజాతమ్మ నగర్ వద్ద కంటైనర్ బైకును ఢీకొనడంతో కురువ అయ్యప్ప(43) మృతి చెందాడు. కృష్ణగిరి మండలం సంగాల గ్రామానికి కురువ అయ్యప్ప(43) వ్యక్తిగత పనుల నిమిత్తం శనివారం డోన్‌కు వచ్చారు. మధ్యాహ్నం కోట్ల భాస్కర్‌రెడ్డి కూరగాయల మార్కెట్ వైపు బైకుపై వెళ్తున్నాడు. అనంతపురం వైపు నుంచి వస్తున్న నాగాల్యాండ్‌కు చెందిన కంటైనర్ వెనుక వైపు నుంచి స్కూటర్‌ను ఢీకొట్టింది. స్కూటరిస్టుపై కంటైనర్ వెళ్లడంతో అయ్యప్ప అక్కడికక్కడే మృతి చెందాడని స్థానికులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన కంటైనర్ డ్రైవర్ నిలపకుండా వెళ్లగా పోలీసుల సమాచారంతో టోల్ గేట్ సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

### సమస్యలు పరిష్కరించాలి

డోన్ టౌన్ : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట వర్కర్లు, హెల్పర్లు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి శివరామ్, నాయకులు దీక్షకు సంఘీభావం తెలిపారు. వేతనాలు పెంచాలని, గ్రాట్యూటీని అమలు తదితర సమస్యలు పరిష్కరించాలని ఈ సందర్భంగా చెయ్యాలని అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు శోభారాణి ప్రభుత్వాన్ని కోరారు. అంగన్‌వాడీ టీచర్లు నాగలక్ష్మీ, సులోచన, సుమలత, రహమద్‌బీ, శ్రీలత, యశోధ, లక్ష్మీశ్వరి పాల్గొన్నారు.

బనగానపల్లె రూరల్ : ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ప్రభుత్వం స్పందించి వెంటనే తమ సమస్యలు పరిష్కరించాలని యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు సరస్వతి, వెంకటలక్ష్మీ కోరారు.

**వలసల నివారణకు చర్యలు తీసుకోవాలి**

బనగానపల్లె రూరల్ : వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వ్యవసాయ కూలీలు ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లకుండా ఉన్న గ్రామాల్లోనే పనులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని డోన్ క్లస్టర్ ఏపీడీ శ్రీవిద్య సూచించారు. స్థానిక ఎన్ఆర్‌జీఎస్ కార్యాలయంలో శనివారం ఉపాధి హామీ టీఏ, ఎఫ్ఏలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించాలని, ఎస్సీ, ఎస్టీలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కూలీలకు రోజుకు రూ.272 వేతనం వచ్చేలా చర్యలు తీసుకోవాన్నారు. సమావేశంలో ఏపీఓ హరికృష్ణ, ఈసీ కిశోర్ పాల్గొన్నారు.

## గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలు



ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వ్యాసరచనపోటీలు నిర్వహిస్తున్న దృశ్యం, బేతంచెర్లలో కబడ్డీ ఆడుతున్న బాలికలు

బనగానపల్లె రూరల్ : గ్రంథాలయాలు విజ్ఞాన సంపద కేంద్రాలని బనగానపల్లె గ్రంథాలయశాఖ అధికారి బషీర్ అహమ్మద్ అన్నారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు వ్యాసరచన,క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో బషీర్ అహమ్మద్ మాట్లాడుతూ విద్యార్థులు తమ విలువైన సమయాన్ని వృథా చేసుకోకుండా పత్రికలు, పుస్తక పఠనం అలవర్చుకోవాలని సూచించారు. ప్రతిభ చూపించిన విద్యార్థులకు ఈ నెల 20న ప్రోత్సాహక బహుతులను అందజేయనున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శ్యామలమ్మ, సబేరా, మధుమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**విద్యార్థులకు ఆటల పోటీలు**

బేతంచెర్ల: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాలలో గ్రంథాలయ అధికారి మధు శేఖర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు త్రోబాల్, కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేస్తామని మధు శేఖర్ తెలిపారు. కార్యక్రమంలో పీఈటీ రంగనాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## చురుగ్గా మంచినీటి పైప్‌లైన్ నిర్మాణ పనులు


రూ.15లక్షలతో నందవరం నుంచి చెరువుపల్లెకు పైప్‌లైన్ పనులు జరుగుతున్న దృశ్యం

బనగానపల్లె : మండలంలోని చెరువుపల్లె గ్రామానికి త్వరలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కృషితో తాగునీటి సమస్య తీరనుంది. సుమారు మూడువేల జనాభా ఉన్న ఆ గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని వివిధ కాలనీల ప్రజలు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే కాటసాని పరిష్రార చర్యలు చేపట్టారు. గ్రామంలో జల్‌జీవన్ పథకం కింద రూ.29 లక్షలతో ఓహెచ్‌ఆర్ ట్యాంకు నిర్మాణం పూర్తి చేయంచారు. గ్రామానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో నందవరం గ్రామంలో బోరు వేయించారు. అక్కడి నుంచి గ్రామానికి పైప్‌లైన్ ఏర్పాటుకు డీఎంఎఫ్ నిధులు రూ.15లక్షలు మంజూరు చేయించారు. ఈ మేరకు చేపట్టిన పనులు పైప్‌లైన్ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. పనులు పూర్తయిన వెంటనే తాగునీటిని సరఫరా చేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయికృష్ణ తెలిపారు.

### భవన నిర్మాణాలు పూర్తి చేయండి

నంద్యాల: పెండింగ్‌లోనున్న గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ మనజిర్ జిలానీ శామూన్ పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రాధాన్యత భవనాల ప్రగతి పనులపై ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్‌లోనున్న 96 గ్రామ సచివాలయాలు, 91 రైతు భరోసా కేంద్రాలు,72 హెల్త్ క్లినిక్‌ల పనులు లక్ష్యాలు నిర్దేశించుకుని పూర్తిచేయాలని చెప్పారు. ప్రతివారం 11 గ్రామ సచివాలయాలు, 13 రైతు భరోసా కేంద్రాలు, 10 హెల్త్ క్లినిక్ ల పూర్తి చేయాలన్నారు. ఇప్పటివరకు 274 గ్రామ సచివాలయాలు, 199 రైతు భరోసా కేంద్రాలు, 97 హెల్త్ క్లినిక్ భవనాలను సంబంధిత శాఖలకు స్వాధీనం చేశామని పంచాయతీరాజ్ శాఖ ఎస్.ఈ రామ్మోహన్ వివరించారు. పంచాయతీరాజ్ ఈఈ, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.